ఆమె పెదవి విప్పలేదు. చెంపదెబ్బలు వేసాడు. అహం దెబ్బతింది కాబోలు. "ఇందులో కొంప మునిగిపోయిందే ముంది డాడీ?" ఆడసింహంలా ఎదురించింది "నమ్మకలేక పోయాడు. తన కూతురేనా?" అనుమానం తొంగిచూచింది. ' పెళ్ళి కాకముందే..." తనమాట పూర్తి కాకముందే. "ఐతే ఏముంది డాడీ? పెళ్ళి పెటాకులు బొమ్మలాటలని ఆచారాలు అడ్డు గోడలని, సాంప్రదాయాలు పాతచింతకాయ పచ్చళ్ళని, యువతీయువకులు కట్టుబాట్ల అడ్డు గోడల్ని ఛేదించి బయటపడాలని మీరే కదా లెక్చర్లిచ్చింది. మీ భావాల కనుగుణంగా నన్ను నేను మలచుకున్నాను. అంతే!, వీరనారిలా విరుచుకుపడింది "మనముంటున్నది భారతదేశంలో నమ్మా! విశ్వానికి వెలుగు ప్రసాదించిన హిందూ ధర్మమమ్మా మనది." అన్నాడు ఆవేశంగా. "ఐతే... ...." అంది "ఆడదాని కన్నిటికంటే విలువైన ఆభరణం శీలం" అన్నాడు "డాడీ!" అంది. 'కాదు నాన్నా అను.' అన్నాడు "నాన్నా! మీరుగూడా....?!" అంది

"ఔను! నేనుకూడా భారతీయుణ్నే! నా భార్య, కూతురు సలక్షణమైన భారతీయ ధర్మాలనాచరించాలన్నదే నా అభిమతం." "ఐతే క్లాసుల్లో మీ లెక్చర్లు!?" అంది "ఈరోజుల్లో అలాంటివి మామూలే విద్యార్థుల దృష్టిలో, నేనొక మంచి ప్రొఫెసర్‌గా పేరు సంపాదించాలని అలా చెప్పాను. నాలాగా ఎందరో మేధావులు ఆత్మ వంచనకు గురౌతున్నారమ్మా! అందుకే అంటారు తనదాకా వస్తేగాని తెలవదని!" శైలబాల ముఖంలో రంగులు మారాయి.

---

(1987 'జాగృతి' మినీ కథల పోటీలో బహుమతి పొందిన కథ)

# వరవిక్రయం

ఆఫీసు గడియారం ఐదుసార్లు అరిచింది. అప్పటిదాకా ఆఫీసును ఆలుముకున్న నిశ్శబ్దానికి కాలం చెల్లింది. రెక్కలొచ్చిన పక్షులు బిలబిల మంటూ బయటకొచ్చేస్తున్నవి. తొందరగా గూటికి చేరాలనే ఆరాటంతో-సాయంత్రం ఉద్యోగులందరి మనసుల్లో పూలజల్లు కురిపించినా మేనేజర్ గిరిధర్ ఎదలో మాత్రం పిడుగుల వర్షం కురిపించింది.

....ఉసూరుమంటూ ఇంటికెళ్ళగానే కప్పు తాళం వెక్కిరిస్తుంది. బడినుండి వచ్చిన పిల్లలు పుస్తకాలు అరుగులమీద పడేసి ఆడుకునేందుకెళ్లారు. పక్కింట్లోంచి తాళాలు తీసుకుని కాఫీ చేసుకుతాగాలి. పిల్లల కందించాలి. అంతటితో కార్యక్రమం పూర్తికాదు. రాత్రి భోజనం తయారీ కుపక్రమించాలి. క్లబ్బునుండి రాగానే ధుమధుమలాడే మధుమతి వడ్డింపుల నోర్పుకు తీరాలి. వచ్చేప్పుడు ఒక్కతేరాదు-రిజిష్టర్ లెటర్ కు ఏకనాలెడ్జ్ మెంటులా మరొకర్ని వెంటేసుకుని వస్తుంది. ఆమె స్నేహితులకు గూడా తగు మర్యాదలు చేయాలి. సుశిక్షితుడైన సైనికుడిలా మధు

మతి పురమాయించే పనులన్నీ చేసుకుంటూ పోవాలి. నాలుక కదిల్తే నరకం ప్రత్యక్షమౌతుంది సాయంత్రం గడపలో అడుగు పెడితే-తిరిగి బయటికొచ్చేది తెల్లవారి ఆఫీసుకే.

ధైర్యం చేసి ఓసారి నాలిక కదిలి "మహిళా మండలి. క్లబ్బుల్లోకి వెళ్ళినా, ఇంటికి తొందరగా వచ్చి యింటిపనులు చూచుకోరాదా!" అన్నాడు.

"అరవచాకిరీ చేసే ఖర్మ నాకొక్కదానికేనా? ఆడా, మగ ఇద్దరూ కలిసి ఇంటి పనులు చేసుకుంటేనే సంసార రథం సాఫీగా సాగుతుంది. మరోసారి ఇలాంటి మాటలు నేను వినదల్చుకో లేదు...." అంటూ ఝాడించి పారేసింది.

"పని మనిషిని పెట్టుకుంటే ఇద్దరికీ హాయి గదా...." అని సలహా యివ్వబోతే. ...."అమ్మో! పని మనుషుల్ని నమ్ముకుంటే ఇంకేమైనా వుందా? ముప్పైరోజుల సరుకులు మూడు రోజుల్లో మాయమై, ఇల్లుగుల్లయి పోతుంది. ఇంతకీ ఈఆలోచన ఎందుకొచ్చినట్టో!" అంటూగుండెలు బాదుకుంది,

"....నేను పగలంతా ఆఫీసులో ఆడవి చాకిరీ చేసి వస్తాను· మరి నాసరదాల మాటేమి?'' టని బయటపడగానే.

...అందుకే నెలకోసారి కలిసి సినిమాకెల్తున్నాంగదా! ఇంకా ఎలాంటి సరదాలున్నాయి తీర్చుకునేందుకు?" అని చీదరించింది.

ఓసారి ధైర్యంచేసి కోపానికొస్తే....ఒంటి కాలుమీద లేచింది.

ఏమండోయ్! లక్షరూపాయల కట్నం పోసి మిమ్మల్ని కొనుక్కున్నాను. అందరిలా పడుండమంటే ఊరుకోను. మీరే నా

బానిసలా పడుండాలి....ఏదో కట్టుతున్న వాడుగదాని మర్యాద ఇస్తే మరీ పేట్రేగి పోతున్నా"రంటూ నోటికి తాళం వేసింది ఈ విషయం మధుమతి వాళ్ళన్నయ్యకు తెలిస్తే తన చమ్డాలూ డదీస్తాడని భయపడి..... వాడికీ విషయాలన్నీ చెప్పవద్దని బతిమి లాడడం తన వంతే ఐంది. వాళ్ళన్నయ్య డబ్బుబలంతో ఏమైనా చేయగలడు

"....అందరూ వెళ్ళిపోయారు సార్!" చాంబర్ తాళం చేతులకోసం వాచ్‌మెన్ చేతులు చాచాడు. గిరిధర్ ఇవ్వలేదు. అతడెవరి కోసం ఎదిరి చూస్తున్నాడో నాగన్నకు తెలుసు. అందుకే

"హర్షవర్ధన్ గారీ రోజు సెలవులో ఉన్నారు గదండీ....!'' గుర్తుచేసాడు.

ఆఫీసులో తనతో ఆత్మీయంగా మాట్లాడేది అతనొక్కడే. పనున్నా, లేకున్నా ఆఫీసువర్కు తర్వాత కాస్సేపు సరదాగా మాట్లాడందే వెళ్ళడు. తాళం చేతులు నాగన్న చేతిలో పెట్టి బయటికి నడిచాడు. తాళం వేసిన తాళం చేతుల్ని జేబులో వేసుకుని బోను లోకి వెళ్ళబోతున్న సింహంలా కారువద్దకు నడిచాడు.

....హర్షవర్ధన్‌ది మంచిమనసు. మంచి సంస్కారం అబ్బిందతడికి అందుకే ఎవరికీ చెప్పలేని తన ఎదసొదనంతా అతనికి చెప్పాడు. అతడు గూడా మనసు విప్పి మాట్లాడాడు. మధుమతి వ్యవహారం విని సానుభూతి వ్యక్తపరిచాడు. జాలి చూపాడు. ....తన స్వంత విషయాలు గూడా చెప్పాడు....తన భార్య ఉత్తమురాలనీ, వారిది ఆదర్శ దాంపత్యమనీ. హర్షవర్ధన్ కుటుంబంలోని పచ్చదనం తనలో ఎందుకు అసూయను రేకెత్తి

స్తుంది? బహుశ! అది తన కుటుంబంలో లేనందుకేనేమో! ప్చ్.... పిచ్చిమనసు.

కారు పరుగులు తీస్తుంది. జ్ఞాపకాల ఊరకల్లో అనూరాధ తళుక్కుమంది. ముద్దమందారంలాంటి మొహం. చిలిపికళ్ళు. ఒద్దిక, వినయం సమపాళ్ళలో రంగరించిన చలాకీతనం ... అనూరాధను అర్ధాంగిగా నిలుపుకోగల్గితే ముమ్మాటికీ జీవితమిలా గుండేదికాదు. అనురాగంతో లాలించి హృదయ సామ్రాజ్యాన్ని ఏలుకునేది. తననుండి ఆమెను దూరం చేసిందెవరు?....అగ్ని సాక్షిగా మూడుముళ్ళువేసి, నాతిచరామి ప్రమాణం చేసిన తానే అన్నీ మరిచాడు. కేవలం అర్థంలోనే పరమార్థముందనుకుని జీవన నౌకను సుడిగుండాలవైపు మరల్చుతుందితానే.... అంతా స్వయంకృతం. అనూరాధను హింసల పాల్జేసి దూరం చేసుకుంది తానే. ఆనాడు దుర్బోధలు చేసిన అమ్మా, అక్కయ్యలీరోజు తనకెలాంటి సహాయం చేస్తున్నారు?....

"సార్! మన యు డి సి వెల్తున్నారు" అంటూ డ్రైవర్ వేగం తగ్గించి హర్షవర్ధన్ను చూపించాడు. కారాపి హర్షవర్ధన్ని హ్వానించాడు "మీ ఇంటిముందు డ్రాప్ చేస్తా" నంటూ.

"మా ఇంట్లోకి వచ్చి టీ తీసుకుని వెల్తా"నంటేనే వస్తానని కండిషన్ పెట్టాడు హర్షవర్ధన్.

హర్షవర్ధన్ ఆదర్శ దాంపత్యాన్ని కళ్ళారా చూడాలనుకున్న తనకీరోజు అవకాశం చిక్కిందని తనలోతానే ఆనందిస్తూ.

"సరే....తప్పుతుందా, పద!" అన్నాడు సీటు చూపిస్తూ.

రింగ్‌రోడ్డుమీద ట్రాఫిక్ జామైపోవడంతో కారు చిన్నగా నడుస్తుంది కాలినడకన అలసిపోయిన బాటసారిలా.

"పెళ్ళిలో ఎంత కట్నం పుచ్చుకున్నావ్?" అడక్కూడదనిది అనుకున్నా అడిగేశాడు గిరిధర్.

"నా భార్య గుణగణాల్ని, వినయ విధేయతల్ని, అందచందాల్ని...."

"అంహా! అదికాదు డబ్బు రూపేణా...."

"డబ్బు పుచ్చుకుని అమ్ముడు బోవడం అంటే నాకు గిట్టదు. దాన్నే వరవిక్రియ మంటారు. అందుకే డబ్బులేమీ పుచ్చుకో లేదు. అసలా ప్రసక్తే రాలేదు...." కొంచెం ఆవేశం తొంగి చూచింది హర్షవర్ధన్లో.

"....అంటే.... పెళ్ళికిముందే ప్రేమ ముదిరి...." ఆర్ద్రోక్తిగా ప్రశ్నించాడు.

"నా భార్య మట్టిలో దొరికిన మాణిక్యమండీ...." కాసింత గర్వం గూడా తొంగి చూచింది.

"అంటే...."

"ఆమెనంతకు ముందే ఓదగుల్బాజీ ప్రేమించి పెళ్ళాడాడట కాళ్ళపారాణి ఆరకముందే కట్నం తెమ్మని బాదిధించాడట. అత్త, ఆడపడుచుల వేదింపులు తారాస్థాయి కందుకున్నాయట. వాళ్ళ నాన్న చస్తూ మిగిల్చిపోయిన ఇల్లు అమ్మి డబ్బు తెమ్మన్నారట. ఇల్లు అమ్మితే వాళ్ళ తమ్ములు, చెల్లి వీధిపాలౌతారని బ్రతిమా లిందట. గృహబహిష్కరణ, విడాకులు నెల రోజుల్లోనే జరిగాయట. ఆ భర్త మహాశయుడు లక్షరూపాయల కట్నంతో మరో అమ్మా

యినిపెళ్ళాడాడట. నాఅదృష్ట వశాత్తూ నా జీవితాన్ని ఆమె పంచుకో గలిగింది...." తన్మయత్వంతో చెప్పుకు పోయాడు.

హర్షవర్ధన్ ఇంటిముందు కారాగింది

ఇంట్లో అడుగు పెట్టగానే వాతావరణం ఆహ్లాదకరంగా గోచ రించింది గిరిధర్‌కు.

"మీరు కూర్చోండి. నా భార్యను పరిచయం చేస్తా" నంటూ లోపలికెళ్ళాడు హర్షవర్ధన్.

ఇల్లు చిన్నదైనా గృహాలంకరణ బాగుంది. ఎదురుగా భారతమాత ఫోటో రెండు పక్కలా జాతీయవీరుల ఫోటోలు. భారతీయ సాంప్రదాయం తొణకిసలాడింది.

లోపల్నుంచి హర్షవర్ధన్ తన భార్యను తీసికొచ్చాడు.

గిరిధర్ కనుబొమ్మలు ముడుచుకు పోతున్నాయి. మెదడు పొరల్లో లావా ప్రవహించింది ఒళ్ళంతా చెమట పట్టేసింది. కళ్ళద్దాలు తుడిచి మరోసారి చూచాడు. గుండెల్లో పెనుతుఫాను చెలరేగింది. లేవబోయి కూచున్నాడు.

"ఈమె నా భార్య. అనూరాధ. వీరు గిరిధర్ గారు మా మానేజరు," చిరునవ్వుతో ఒకరినొకర్ని పరిచయం చేశాడు హర్షవర్ధన్.

గిరిధర్ అనూరాధలు నమస్కారాలు చేసుకుంటూ ఒకరి మొహాలొకరు చూచుకున్నారు. వారి ముఖాల్లో రంగులు మారడం స్పష్టంగా గుర్తించాడు హర్షవర్ధన్.

గిరుక్కున వెనక్కు తిరిగింది అనూరాధ.